# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## ప్రజా పాలనలో మహిళల భాగస్వామ్యం

ప్రపంచంలోనే మొట్టమొదటి మాతృస్వామిక వ్యవస్థలో ఉజ్వలమైన నాగరికత కలిగింది భారతదేశం. మాతృస్వామ్య వ్యవస్థలో ఎటువంటి అభివృద్ధి ఉంటుందో స్వయంగా చవిచూసిన సమాజం ఇది. ఆ తర్వాత ఆర్యుల కాలంలో మాతృస్వామ్యం స్థానంలో పితృస్వామ్యాన్ని ఏర్పాటు చేసి పురుషాధిక్య వ్యవస్థగా మార్చింది. ఇది స్త్రీల అస్తిత్వానికి గొడ్డలి పెట్టయ్యింది. స్త్రీలు విద్యకు అర్హులు కాదని వారిని విధివంచితులను చేసింది. మహిళలను ద్వితీయ శ్రేణిగానే పరిగణించడం మొదలైంది. ఆధునిక యుగంలో విద్యాభివృద్ధి పుణ్యమా అని మహిళలు విద్యాధికులై అన్ని రంగాలలో రాణిస్తున్నారు.

నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2020-21 ప్రకారం మన దేశంలో స్త్రీ పురుష నిష్పత్తి 985:1000 గా ఉన్నది. జనాభాలోనే తక్కువ అనుకుంటే ప్రాతినిధ్యంలోనూ మ హిళా పాత్ర తక్కువే. ముఖ్యంగా శాసన నిర్వహణలో మరీ తక్కువ. దీన్ని అధిగమించడానికి జరిగిన ప్రయత్నమే మహిళా బిల్లు.




సెప్టెంబర్ 19న పార్లమెంటు నూతన భవనంలో ప్రత్యేక సమావేశాల సందర్భంగా మధ్యాహ్నం 1.45 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ మహిళా రిజర్వేషన్ గురించి ప్రకటించారు. అనంతరం 2 గంటలకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘువాల్ బిల్లుకు సంబంధించి 128వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరుతో సెప్టెంబర్ 20న లోక్‌సభలో, 21న రాజ్యసభలో ఆమోదం పొందింది. లోక్‌సభలోని 454 మంది ఓటింగ్‌లో పాల్గొనగా 452 అనుకూలంగా, రెండు ఓట్లు ప్రతికూలంగా వచ్చాయి. రాజ్యసభలోని 214 మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో 543 మంది సభ్యులున్న లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం 181కు చేరుతుంది. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం లోక్‌సభలో 542 సీట్లకు 78మంది, రాజ్యసభలో 224 మందికి 24 మంది మహిళలు ఉన్నారు. మొదటి లోక్‌సభలో 5 శాతంగా ఉన్న మహిళల సంఖ్య 17వ లోక్‌సభ నాటికి 14.39 శాతానికి చేరుకున్నది. అయినా ఇది తక్కువే.

మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలనే నిర్ణయానికి చాలా చరిత్ర ఉన్నది. ముఖ్యంగా ఈ డిమాండ్ వలస రాజ్యం కాలం నాటిది. 1935లో భారతప్రభుత్వ చట్టం ప్రావిన్షియల్ లెజిస్లేచర్‌లో 41 రిజర్వ్ సీట్లు, సెంట్రల్ లెజిస్లేచర్‌లో పరిమిత రిజర్వేషన్లు మహిళలకు అందించింది. అయితే ఉమెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ ఏ ఐ), ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ (ఏఐడబ్ల్యూసీ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా వంటి ఆ కాలంనాటి మహిళా సంఘాలు మహిళలకు ఓటు హక్కు మాత్రమే కోరడం మొదలు పెట్టాయి.

భారత రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ సభలో కూడా మహిళా రిజర్వేషన్ అంశం చర్చకు వచ్చింది. అయితే రిజర్వ్ సీట్ల అవసరం లేకుండా మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని కొందరు సభ్యులు వాదించడంతో రిజర్వేషన్ అనవసరమని భావించారు. సరోజిని నాయుడు కూడా మహిళలు దృఢమైనవారని వారికి ప్రత్యేక రిజర్వేషన్ అవసరం లేదని వాదించారు. 1974లో మహిళల స్థితి పేరుతో ప్రభుత్వం నియమించిన కమిటీ సమగ్ర నివేదిక రాష్ట్ర శాసన సభలు, పార్లమెంట్‌లో మహిళలకు రిజర్వేషన్ సిఫారసు చేసిన మొదటి నివేదిక.

భారత రాజ్యాంగం భారతీయులకు లింగ భేదం లేకుండా అందరికీ సమాన హక్కులుండాలని చెప్తుంది. కానీ, పురుషాధిపత్యం ఎక్కువై మహిళల ప్రాతినిధ్యం తగ్గుతూ వచ్చింది. దీంతో మహిళా రిజర్వేషన్ బిల్లు అవసరం పెరుగుతూ వచ్చింది. ఫలితంగా 1989లో రాజీవ్‌గాంధీ పట్టణ, స్థానిక సంస్థల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీజం పడింది.1992, 1993ల్లో పీవీ నరసింహారావు 72,73 రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిద్వారా గ్రామీణ, పట్టణ, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టారు. దీన్ని ఉభయ సభలు ఆమోదించాయి. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎంపికయ్యారు. 1996లో దేవెగౌడ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం 81వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టినప్పటికీ లోక్‌సభ రద్దు కారణంగా బిల్లు రద్దయింది.

12వ లోక్‌సభలో వాజ్‌పేయ్ నాయకత్వంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పటికీ మద్దతు లభించలేదు. ఆ తర్వాత పలుసార్లు ప్రయత్నం జరిగినా సఫలం కాలేదు. 2008లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలో బిల్లు ప్రవేశ పెట్టింది. అయితే రాజ్యసభలో ఆమోదింపబడింది కానీ లోక్‌సభ పరిశీలనకు రాలేదు. ఆ తర్వాత లోక్‌సభ రద్దయింది. 2014,2019లో బీజేపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా ప్రచారం చేసింది. ఎట్టకేలకు 128 రాజ్యాంగ సవరణ ద్వారా బిల్లును ఆమోదించింది.

ఈ బిల్లులోని అంశాలను పరిశీలిస్తే లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించే ఆర్టికల్ 330లోని నిబంధనల నుంచి తీసుకున్న 330 ఏ ను రాజ్యాంగంలో చేర్చేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన సీట్లలో రొటేషన్ ప్రాతిపదికన మహిళలకు రిజర్వ్ చేయబడిన సీట్లలో మూడింట ఒక వంతు సీట్లు ఇవ్వాలి. ఆర్టికల్ 330ఏ కింద రాష్ట్ర శాసనసభ సీట్ల రిజర్వేషన్ తప్పనిసరి చేస్తుంది. అదనంగా ఎస్సీ ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన సీట్లలో మూడింట ఒకవంతు మహిళలకు కేటాయించాలి. (ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోబడే సీట్లలో మూడింట ఒక వంతు మహిళలకు రిజర్వేషన్ ఉండాలి.

1992, 1993ల్లో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో 72,73 రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిద్వారా గ్రామీణ, పట్టణ, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టారు. దీన్ని ఉభయ సభలు ఆమోదించాయి. దీంతో దేశవ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎంపికయ్యారు.

ఢిల్లీలోని ఎన్‌సీటీ (కేంద్ర పాలిత ప్రాంతం)లో మహిళల రిజర్వేషన్ కొత్త నిబంధన ప్రకారం 239 ఏ ఏ(27)(బి) బిల్లుద్వారా చేయబడిన సవరణలు ఢిల్లీ జాతీయ రాజధానికి కూడా వర్తిస్తాయి. జనగణన అనంతరం ఈ రిజర్వేషన్ అమల్లోకి వస్తుంది. జనాభా లెక్కల ఆధారంగా మహిళలకు సీట్లు కేటాయించేటపుడు డిలిమిటేషన్‌ను చేపడతారు. 15 సంవత్సరాల పాటు ఈ బిల్లు కింద రిజర్వేషన్లు కల్పిస్తారు. అయితే ఇవి పార్లమెంట్ చేసిన చట్టం ద్వారా నిర్ణయించిన తేదీ వరకు కొనసాగుతాయి.

స్త్రీలను ప్రజాపాలనకు మరింత చేరువ చేయటం, సమాజంలో సమానత్వం, సాధికరత ప్రోత్సాహం, స్థానిక, రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో, పరిపాలనలో వారికి దారులను ఏర్పరచటం, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం పెంచటం ఈ బిల్లు అనుకూలతలు. కాగా, కొన్నిసార్లు కొన్ని రాజకీయ పార్టీలు స్వలాభం కోసం బలహీన నియోజక వర్గాలను మహిళా అభ్యర్థులకు కేటాయించవచ్చు. బలమైన పురుషులకు బదులుగా స్త్రీలను నియమించటం ప్రతికూలతలకు దారి తీయవచ్చు.

ఏదేమైనప్పటికీ ఎన్నో ఏండ్ల నుంచి జరుగుతున్న పోరాటానికి ఫలితంగా రూపొందిన ఈ బిల్లు మహిళలను ప్రజా పాలనకు మరింత చేరువ చేస్తుందని ఆశిద్దాం.



డాక్టర్ బొల్లేపల్లి సుదక్షణ
98495 20572
(వ్యాసకర్త : అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభుత్వ సిటీ కళాశాల )



## ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే

ఆకాశంలో సగం, భూమిలో సగం, సమగ్ర అభివృద్ధిలో సగం, అవకాశాల్లోనూ సగం వాటా మాదే అంటూ దశాబ్దాలుగా నినదిస్తున్న భారతీయ మహిళలకు ఇంత వరకు నిరాశే ఎదురవుతూ వచ్చింది. పార్లమెంట్ ముందే తచ్చాడుతున్న ఈ బిల్లును పాస్ చేసి చిత్తశుద్ధితో మహిళలకూ సమానత్వాన్ని ఇచ్చే ఉద్దేశం చట్టసభల్లో కొలువైన మగానుభావులకు కలగకపోవడం విచిత్రమే కాదు, ఎందుకంటే నిచ్చెనమెట్ల వ్యవస్థలో ఎదిగిన మనకు ఈ వ్యత్యాసాలు లేకపోతే మరి ముద్ద దిగదాయే. కానీ అందరూ అదేవిధంగా ఉండరు కదా. అవును ఇప్పుడు పార్లమెంట్ ఉభయసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వచ్చిన తర్వాత అవసరం ఏముందనేది మీ సందేహం కావచ్చు. ఆ బిల్లు ఆమోదం పొందటానికి తెలంగాణ రాష్ట్ర నాయకులు చేసిన కృషిని విస్మరించరాదు.

మహిళా బిల్లుకోసం ఇంతవరకు జరిగిన పోరాటాలు ఒక ఎత్తైతే ఈసారి ఎటువంటి వ్యతిరేకత లేకుండా మహిళా బిల్లు ఉభయసభల్లోను ఆమోదం పొందింది. దీనివెనుక మన రాష్ట్ర నాయకుల కృషి ఎంతో ఉన్నది. మహిళ బిల్లు కోసం ఇటీవల దేశ రాజధాని న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారత జాగృతి చైర్ పర్సన్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దీక్ష చేపట్టారు. అంతేకాదు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు 'మహిళా రిజర్వేషన్' బిల్లు అమలుకోసం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ లేఖలు రాశారు. దీంతో కేంద్రం మొద్దు నిద్ర వదిలి బిల్లు పాస్ చేయడానికి సిద్ధమైంది. ఆర్టికల్ 15(3) ప్రకారం భారత రాజ్యాంగం స్త్రీ, పురుషులను సమానంగా గుర్తించింది. మహిళల అభివృద్ధి, ఉన్నతికి రాజ్యం ప్రత్యేక చట్టాలు చేయవచ్చు. ఆర్టికల్ 39(బీ) ప్రకారం పురుషులతో సమానంగా మహిళలకూ వేతనం చెల్లించాలి. ఆర్టికల్ 39(ఏ) ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన జీవన ఉపాధి కల్పించాలి. 15 ఏ(ఈ) ప్రకారం స్త్రీ గౌరవ పరిరక్షణకు ప్రతి పౌరుడు కృషి చేయాలి. అంటే రాజ్యాంగంలో పొందుపరచబడిన హక్కులను అమలు చేసే నాయకత్వం కావాలి. అదృష్టవశాత్తు తెలంగాణ ప్రజలకు నాయకత్వ కొరత లేదు.

మన సీఎం కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావు వీరంతా ఇంట గెలిచిన నాయకత్వం. ఇక రచ్చ గెలవడానికి ఎప్పుడూ సం సిద్ధం, అంటే రాష్ట్రం ఏర్పడి నిండా పదేండ్లు పూర్తికాకుండానే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉన్న రాష్ట్రాల అభివృద్ధికి ధీటుగా చాలా విషయాల్లో మన రాష్ట్రాన్ని ఒక ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టిన ఘనత మన నాయకులది. మన ఎమ్మెల్సీ కవిత మాత్రమే కాదు. సాక్షాత్తు మన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఏ రాష్ట్ర శాసనసభలోను ఇంకా ఆమోదానికే నోచుకోని మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి మన నాయకుడు ఎంతటి దూరదృష్టితో ఉన్నారో గమనించవలసిన సందర్భం ఇది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కేంద్రానికి తీర్మానం పంపించిన ఘనత మన ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. ఇప్పుడే కాదు యూపీఏ ప్రభుత్వ హయాంలో 2009లోనే కేసీఆర్ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన బీసీ ఉద్యమ నాయకులను ప్రధాని మన్మోహన్ సింగ్ దగ్గరకు తీసుకెళ్లారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు ఆవశ్యకతను వివరించి బీసీ మంత్రిత్వ శాఖను ప్రకటించాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రస్తుత బీసీ వర్గాల అతి ముఖ్య డిమాండ్ కుల గణన గురించి సానుకూలంగా స్పందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే. ఎవరూ అడగక ముందే ఆదర్శ రాజకీయాల కోసం తన, పర భేదాలకు తావులేకుండా సమాజ అభివృద్ధే తారకమంత్రంలా జపిస్తూ, ఆచరిస్తూ అనుసరిస్తూ దేశ రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలుకుతున్న కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో అసలైన ప్రత్యామ్నయం కాగలరు.

దేశవ్యాప్తంగా జరిగే జనాభా లెక్కల్లో బీసీల కుల గణన జరుపాలని కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీలో తీర్మానం పాస్ చేసి కేంద్రానికి పంపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. అదేవిధంగా మహిళా బిల్లును సమర్థిస్తూనే మహిళా బిల్లులో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సూచించిన నాయకుడు మన సీఎం కేసీఆర్. అదేవిధంగా దశాబ్దాలుగా ఓబీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి శాసనసభ సమావేశంలోనే ఓబీసీలకు 33శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపిన నాయకుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్.

తెలంగాణ రాష్ట్రంలో చిన్న చిన్న కులాలకు సామాజిక న్యాయం జరగాలని మార్కెట్ కమిటీ నియామకాలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర కేసీఆర్ సొంతం. అదే విధంగా మద్యం షాపుల్లో గౌడ కులస్తులకు, ఫర్టిలైజర్ షాపుల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించిన ఏకైక నాయకుడు మన కేసీఆర్. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే క్రమంలో భాగంగా వృత్తిపై ఆధారపడిన బీసీలను అభివృద్ధి చేయడం కోసం యాదవ సోదరులకు గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ, నేత కార్మికులకు సబ్సిడీతో రుణాలు, చాకలి, మంగలి కులాల వారికి 250 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, ఆధునిక ధోబీ ఘాట్ల నిర్మాణం చేపట్టారు. గీత కార్మికులకు తాటి చెట్ల మీద పన్నును రద్దు చేసి కల్లు దుకాణాలను తిరిగి ప్రారంభించి వారికి ఉపాధి కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌ది.

ఇలా చెప్పుకుంటూ పోతే బీసీలలో అన్ని కులాలకు సమన్యాయం సమాన అభివృద్ధికోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక రాజకీయ మేరునగధీరుడు మన సీఎం కేసీఆర్. ఇలా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన విధంగానే రాబోయే కాలంలో భారతదేశాన్ని కూడా అభివృద్ధి చేయడానికి దేశ్ కీ నేతగా ఎదగాలి మన కేసీఆర్!!!



ఉపేంద్ర
9963202547
(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యులు)



## భగీరథుడెవరు ?


నీరు పల్లమెరుగు
నిజమని నమ్మించిన ఓ అబద్ధం
నీళ్ల నిలువుదోపిడీకి
నొక్కివక్కాణించిన బూటకం

నీటికి పల్లమే కాదు ఎత్తులు తెలుసు
భగీరథుడికి నీటిని పల్లంలోకి
తీసుకెళ్లడమే తెలుసు
చంద్రశేఖరుడు నీటిని ఎత్తుకు
తీసుకెళ్లి సిగలో బంధించాడు

ఆకాశంతో దోస్తీ అవనిపై వ్యాప్తి
పంట పొలాల కండ్లల్లో దీప్తి
నెర్రలు వారిన భూములు
ఎద విప్పారి దున్నమంటున్నయి
బిరుసుకు పోయిన ఒడ్లు
బంతి చేమంతితో జత కడ్తమంటున్నయి

దున్నిన దుక్కి గంధమై
పరిమళ భరిత సుగంధమై
పెద్ద గడప కుంకుమై
పెద్ద ముత్తయిదువ కాలి పసుపై
బొడ్రాయి అమ్మవారి జాతరై
ఎనకటి రోజుల ఊరైంది
నాస్టాలజిక్ ప్రపంచంలోకి వెళ్లామా?
మళ్లీ పునర్జన్మ ఎత్తామా ?

అవును నా ఊరు తిరిగొచ్చింది
తలపై గంగమ్మతో
చంద్రశేఖరుడే దిగివచ్చిండు
పాలమూరు రంగారెడ్డి నల్లగొండ
నిండుగా కృష్ణమ్మ జలధారలు
సిరులు సిరులుగా
పచ్చబడింది నా పాలమూరు



ఏ.జయంతి
98663 71918

## విధ్వంసం నుంచి వికాసం వైపు

75 ఏండ్ల స్వతంత్ర భారతం సాధించిన ప్రగతి గణనీయమైనదే అయినా, ఆశించిన లక్ష్యాలను, చేరవలసిన గమ్యాలను మాత్రం ఇంకా చేరలేదనే చెప్పాలి. ప్రకృతి ప్రసాదించిన వనరులు, కష్టించి పనిచేసే ప్రజలు ఉన్నప్పటికీ పాలకుల అసమర్థత, భావదారిద్ర్యం ఫలితంగా వనరుల సద్వినియోగం జరగడంలేదు. అన్నీ ఉండి కూడా ప్రజలు అకారణంగా అవస్థలు అనుభవిస్తున్నారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, బలహీనవర్గాల జీవితాల్లో అలుముకొన్న పేదరికం ఇప్పటికీ తొలగిపోలేదు. వనరులను సంపూర్ణంగా వినియోగించుకొని ప్రగతి ఫలాలు అన్నివర్గాల అభ్యున్నతికి సమానంగా ఉపయోగపడిన నాడే సాధించుకున్న స్వాతంత్ర్యానికి సార్థకత.

దేశ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో అహింసాయుతంగా, శాంతియుత పంథాలో కేసీఆర్ నేతృత్వంలో మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. సమైక్య పాలనలో తెలంగాణలోని అన్నిరంగాలూ విధ్వంస మయ్యాయి. నాటి తెలంగాణ నాయకత్వం సమైక్య నాయకులకు కొమ్ము కాస్తూ రావడం వల్ల తెలంగాణ తీవ్రమైన వివక్షకు, దోపిడీకి గురైంది. తెలంగాణ ప్రజలందరూ ఒక్కతాటిపై నిలిచి చేసిన సుదీర్ఘ ప్రజా ఉద్యమం ఫలితంగా స్వరాష్ట్ర స్వప్నం సాకారమైంది.



పది సంవత్సరాల కిందటి తెలంగాణ జీవనచిత్రాన్ని తలుచుకుంటే ఇప్పటికీ గుండెలు పిండేసినట్లయి దుఃఖం తన్నుకొస్తది. ఎటుచూసినా పడావు పడ్డ పొలాలు, పూడుకపోయి తుమ్మలు మొలిచిన చెరువులు, ఎండిపోయి దుబ్బతేలిన వాగులు, అడుగంటిన భూగర్భ జలాలు, ఎండిపోయిన బావులు, పాతాళం లోతుకు పోయినా సుక్క నీరు కానరాని బోర్లు, ఎడతెగని కరెంటు కోతలు, అప్పుల ఊబిలో చిక్కి ఆశలు సైతం అడుగంటి ఆఖరుకు ఆత్మహత్యలే శరణ్యమైన అన్నదాతలు, బతుకుమీద ఆశ చచ్చి ఉరి పెట్టుకుంటున్న చేనేత కార్మికులు, యువకులంతా వలసెల్లిపోతే ముసలివాళ్లే మిగిలిన పల్లెలు, ఇండ్లకు తాళాలు పడి గడ్డి మొలుస్తున్న గోడలు, మొరం తేలిన వాకిళ్లు, తినడానికి తిండిలేక గంజి కేంద్రాలతో ఆదుకోవాల్సిన గడ్డు పరిస్థితులు.

ఇటువంటి పరిస్థితుల నడుమ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ పునర్నిర్మాణాన్ని ఒక పవిత్రయజ్ఞంగా నిర్వహించింది. నిజాయితీతో, నిబద్ధతతో, నిరంతర మేధోమథనంతో అవిశ్రాంతంగా శ్రమించింది. విధ్వంసమైన తెలంగాణను విజయవంతంగా వికాసం వైపు నడిపించారు సీఎం కేసీఆర్.

ప్రజల అవసరాలు, ఆకాంక్షలు ఎరిగిన నాయకుడు కనుక, దానికి అనుగుణంగా అన్నిరంగాలనూ ప్రక్షాళన చేశారు. అనతి కాలంలోనే తిరుగులేని ఫలితాలను సాధించారు. అనేక రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టారు. దార్శనిక దృక్పథంతో, పారదర్శక విధానాలతో, అభివృద్ధిలో, సంక్షేమంలో కొత్త పుంతలు తొక్కించారు.. తెలంగాణ ఆచరిస్తుంది - దేశం అనుసరిస్తుంది. అనే దశకు తెలంగాణను తీసుకొచ్చిన నిత్యకృషీవలుడు కేసీఆర్.

నేడు తెలంగాణ జీవన దృశ్యాన్ని చూస్తే.. నిరంతర విద్యుత్తు వెలుగులు, పంట కాలువలతో, పచ్చని చేన్లతో కళకళలాడుతున్నది. మండే ఎండల్లో సైతం చెరువులు మత్తడి దుంకుతున్నయి. వాగులు, వంకలు, వాటిపై నిర్మించిన చెక్ డ్యాములు నీటి గలగలలతో తొణికిసలాడుతున్నాయి. తరలివస్తున్న కాళేశ్వర జలధారలతో గోదావరి సతత జీవధారయై తెలంగాణ భూములను తడుపుతున్నది. ఒకనాడు చుక్క నీటికోసం అలమటించిన తెలంగాణ ఇపుడు ఇరవైకి పైగా రిజర్వాయర్లతో అలరారుతున్నది. మూడు కోట్ల టన్నుల వరిధాన్యం దిగుబడితో నేడు తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా విలసిల్లుతున్నది. సంక్షేమంలో, అభివృద్ధిలో సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తున్నది. దశాబ్దకాలంలో తెలంగాణ సాధించిన అపూర్వ ప్రగతిని చూసి యావద్దేశం ఆశ్చర్యానికి లోనవుతున్నది. ఈ అద్భుతమైన పురోగమనం ఇదే రీతిన కొనసాగే విధంగా తెలంగాణ ప్రజలు తమ సంపూర్ణమైన ఆశీర్వాద బలాన్ని ఇదే రీతిన రానున్న ఎన్నికల్లో అందించాలని తీర్మానించుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పటిష్టమైన క్రమశిక్షణతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసింది. సంపద పెంచింది. ప్రజలకు పంచింది. దేశంలో స్థిరపడిన పెద్ద రాష్ట్రాలను అధిగమించి నూతన రాష్ట్రం తెలంగాణ రూ.3,12,398 తలసరి ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. అదేవిధంగా తలసరి విద్యుత్తు వినియోగంలో జాతీయ సగటు కంటే 1,255 యూనిట్లను అధిగమించింది. దేశ సగటుకంటే 70శాతం అత్యధికంగా 2,126 యూనిట్ల సగటు వినియోగంతో తలసరి విద్యుత్తు వినియోగంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్ర జీఎస్డీపీ 2014లో రూ.4,51,580 కోట్లు. అదే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ వ్యూహాత్మక పాలనా కొనసాగించడంతో 2023 నాటికి రూ.13,13,391 కోట్లు పెరిగింది. అంటే దాదాపు మూడు రెట్లు పెరిగింది. అదే విధంగా తెలంగాణ తలసరి ఆదాయం చూసుకుంటే 2014లో రూ.1,24,104 ఉంటే, అదే తలసరి ఆదాయం 2023లో రూ.3,17,117 లకు పెరిగింది, అంటే అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్నది.

అదే విధంగా రాష్ట్రం ఏర్పడిన నాడు తెలంగాణ స్థాపిత విద్యుత్ సామర్థ్యం: 2014లో 7,778 మెగావాట్లు. తొమ్మిదేండ్ల పాలన తర్వాత తెలంగాణ రాష్ట్ర స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 2023లో 26,000 మెగావాట్లు. తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2014లో 1356 యూనిట్స్‌గా ఉంటే తొమ్మిదేండ్ల పాలనలో 2023 నాటికి 2150 యూనిట్స్‌కు చేరుకున్నది.

రాష్ట్రం ఏర్పడే నాటికి వ్యవసాయానికి సాగు నీరు 2014లో 62 లక్షల ఎకరాలు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2023లో 135 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనుడు కేసీఆర్. పంటల సాగు విస్తీర్ణం 2014లో 131 లక్షల ఎకరాలు మాత్రమే ఉంటే అది నేడు 2023 లెక్కల ప్రకారం 220 లక్షల ఎకరాలు. ధాన్యం ఉత్పత్తి 2014 నాటికి 68 లక్షల టన్నులైతే రాష్ట్రం ఏర్పడిన తరువాత తొమ్మిదేండ్లకు మూడింతలై 2023 నాటికి 272 లక్షల టన్నులు అయింది.

2014లో ఐటీ పరిశ్రమలో 3,23,396 ఉద్యోగాలు ఉంటే నేడు 9.05.715 ఉద్యోగాలు పెరిగాయి. ఐటీ ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. నాడు 5 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉంటే నేడు జిల్లాకు ఒక్కటి చొప్పున 33 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసింది ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో 298 ఉన్న ప్రభుత్వ గురు కులాలు 1005 కు చేరుకున్నాయి. ఇవే కాకుండా ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కేసీఆర్ ఈ రోజు ప్రతి ఒక్కరి గుండెల్లో పదిలంగా ఉన్నారు. ప్రతిపక్ష నేతలు చేసే అసత్య ప్రచారాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు. మూడో సారి కేసీఆర్ ప్రభుత్వమే రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.



జి. రాజేశ్వర్
96035 79115